# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- 2047 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ సాధించడమే ప్రతి భారతీయుని ఆశయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్ తెలిపారు.

- క్యాన్సర్ నివారణలో అత్యుత్తమ వైద్యవిధానాల అమలుకు కృషి చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం. టి. కృష్ణ బాబు తెలియచేసారు.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

- రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

నీతి ఆయోగ్ 9వ పాలకవర్గ సమావేశం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర మంత్రులు, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, ఇతర సభ్యులు, సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ చైర్మన్ హోదాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... 2047 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ సాధించడమే ప్రతి భారతీయుని ఆశయమని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు చురుకైన పాత్ర పోషిస్తాయన్నారు. కాగా... ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపై ప్రసంగించనున్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అమరావతి, పోలవరం ప్రాజెక్టులు ఏ విధంగా ఉపకరిస్తాయో ముఖ్యమంత్రి వివరించనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా రంగాలకు ఉన్న అవకాశాలను నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి మురుగన్ తెలిపారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈరోజు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు ఆకాశవాణి విజయవాడ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ జనరల్ సోమేశ్వర రావు, ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటితో పాటు పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విజయవాడలో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 2040 లక్ష్యంగా బడ్జెట్ కేటాయించామని, ఆయా ప్రాంతాల్లో 8.2 శాతం ఆర్థిక అభివృద్ధిని లక్ష్యంగా నిర్దేశించామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్న ఆయన... తాజా బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి 50 వేల 474 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర తోపాటు ప్రకాశం జిల్లాను కూడా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి.... ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రొయ్యల బ్రీడింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేన్సర్ లక్షణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టేందుకు ఇంటింటికీ వైద్య బృందాలను పంపించే కార్యక్రమం మొదలు పెడుతున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం. టి. కృష్ణ బాబు తెలిపారు. విశాఖలోని ఆంధ్ర వైద్యకళాశాలలో రెండురోజుల పాటు జరగనున్న నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ వార్షిక సమావేశాల ప్రారంభోత్సవానికి ఈరోజు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వచ్చే నెల 15 నుండి వైద్య బృందాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. క్యాన్సర్ నివారణ, నిర్మూలన అంశాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్యవిధానాలను పాటించేందుకు సంబంధిత వైద్య నిపుణులతో చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వైద్యకళాశాలలకు ఆంకాలజీ విభాగాలను ఇప్పటికే మంజూరు చేశామని, నిపుణులైన వైద్యుల కొరత లేకుండా చర్యలు చేపట్టామని వివరించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్‌లు, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. జలవనరుల శాఖ అధికారులు ఈ మధ్యాహ్నం 3 గంటలకు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 13.75 అడుగులు ఉండగా 13 లక్షల 261 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా... రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురవచ్చని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. బలమైన గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో పలువురు మంత్రులు ఈరోజు పర్యటించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి లతో పాటు పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు, జిల్లా కలెక్టర్ కె. వెట్రీ సెల్వి, పలువురు అధికారులు పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... నిర్వాసితులకు ప్రభుత్వం అత్యంత

ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వరదలు తగ్గి సాధారణ పరిస్థితులు వచ్చే వరకు పునరావాస కేంద్రాల్లో ఉండవచ్చని, అధికారులు అన్ని సౌకర్యాలూ కల్పిస్తారని వరద బాధితులకు హామీ ఇచ్చారు. వరద బాధిత కుటుంబాలకు 3 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈరోజు జరిగింది. జెడ్పీ ఛైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేష్ కుమార్ లు పాల్గొన్నారు. అదేవిధంగా శాసన మండలి సభ్యులు చిరంజీవి రావు, వరుదు కళ్యాణి, శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, మత్యరాస విశ్వేశ్వరరాజు, రేగ మత్స్యలింగం, జెడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం. పోలినాయుడు అజెండాను చదివి, వినిపించారు. జడ్పీ పరిధిలోని ఏడు స్థాయీ సంఘ కమిటీల ఛైర్మన్లుగా నూతన శాసన సభ్యుల పేర్లను ఛైర్ పర్సన్ ప్రతిపాదించగా జడ్పీటీసీ సభ్యులు ఆమోదం తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, జ్యోతిష్య పండితులు పసుమర్తి కామేశ్వర శర్మ ఈ ఉదయం విజయవాడలో తుది శ్వాస విడిచారు. ఆకాశవాణి వక్తగా ప్రఖ్యాతి గాంచిన కామేశ్వర శర్మ వయస్సు 79 సంవత్సరాలు. కంచి పరమాచార్యులు చంద్రశేఖర సరస్వతి సూచన మేరకు ఆయన గత 50 సంవత్సరాలుగా జ్యోతిష్య రంగంలో లక్షలాది మందికి ఉచిత సేవలందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ముగింపు తేదీని వచ్చే నెల 3వ తేదీ వరకు పొడిగించినట్టు పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు గడువు తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంతవరకు టెట్ పరీక్షకు 3 లక్షల 20 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని, ఆన్లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షలు అక్టోబర్ 3 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు జరగనున్నాయని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్ల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలైన సందర్భంగా ఈరోజు జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమర జవాన్ల కుటుంబ సభ్యులను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి ఎం.రజనీ కుమారి మాట్లాడుతూ... కార్గిల్ యుద్ధంలో ప్రకాశం జిల్లాకు చెందిన ముగ్గురు జవాన్లు అమరులయ్యారని, 50 మంది జిల్లా వాసులు ఈ యుద్ధంలో పాల్గొన్నారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =